



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్


తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


సంచిక : 294 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 11-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

- ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసినరాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా



# నేడు మున్సిపల్ ఎన్నికలు

**ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడి**




## 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్



హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు.

-మిగతా 2 లో





## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

- చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది
- మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,

కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ

-మిగతా 2 లో



## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ,

భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను


-మిగతా 2 లో

## తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

**సొమ్ములు మావి... గొప్పలు మీవా.?**

- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు
- అది తెలంగాణ ప్రజల సొమ్ము
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

**నిధులో కోత.. ఫెడరలిజంపై దాడే...**



హైదరాబాద్,

కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు.

-మిగతా 2 లో

## అర్జున్ టెండూల్కర్ వివాహం

- కుటుంబంతో కలసి ప్రధానిని ఆహ్వానించిన సచిన్
- రాష్ట్రపతి, రాహుల్, అమిత్ షాలకు కూడా ఆహ్వానం

న్యూఢిల్లీ,

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లికి కుటుంబంతో కలసి ప్రధానిని కలసి ఆహ్వానం అందించారు. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబైలో వీరి పెళ్లి జరగనుంది. ఈ నేపథ్యంలో సచిన్ తన కుటుంబంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మంగళవారం కలిశారు. అర్జున్ టెండూల్కర్- సానియా చందోక్ వివాహానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సచిన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

-మిగతా 2 లో



## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు


- మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డిజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

-మిగతా 2 లో



## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం తీర్మానం

- నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు
- అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు
- సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపణ

న్యూఢిల్లీ

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది.

-మిగతా 2 లో

## నేటినుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

- అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష
- 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి




అమరావతి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

-మిగతా 2 లో

## నేడు మున్సిపల్

# ఎన్నికలు

మొదటి తరువాయి



రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభంకానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంఠకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్టిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ పక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందం

# భారత్‌కు దెబ్బ

మొదటి తరువాయి

అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

## అర్జున్ టెండూల్కర్ వివాహం

మొదటి తరువాయి



అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్‌ను కూడా కలసి ఆహ్వానాలను అందచేశారు. ఈ భేటీలో అర్జున్‌తో పాటు సచిన్ భార్య అంజలి, కుమార్తె సారా కూడా పాల్గొన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబైలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ టెండూల్కర్ ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ ద్వారా మారిన సంగతి తెలిసిందే. గోవా తరఫున ఆడుతున్న అర్జున్ ఫాస్ట్ బౌలర్‌గా, లోయర్ ఆర్డర్ బ్యాటర్‌గా రాణిస్తున్నాడు. 2022లో రంజీ ట్రోఫీలో గోవా తరఫున అరంగేట్రంలోనే శతకం బాదడం విశేషం. తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన తన తండ్రి సచిన్ ఘనతను అర్జున్ తిరిగరాశాడు.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

మొదటి తరువాయి

2018–19 నుంచి 2022–23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు.పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024–25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి



వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం÷–ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్ధేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

మొదటి తరువాయి

వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిందు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు.ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ



ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి తరువాయి

ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు.

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం తీర్మానం

మొదటి తరువాయి

సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

# నేటినుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

ఇక, ఈ నెల 14వ తేదీన 2026–27కి సంబంధించిన బ్జడెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

# భూముల రీ సర్వేపై అవగాహన సదస్సు



**లింగాల, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామపంచాయతీలో భూభారతి పథకంలో భాగంగా భూముల రీ సర్వేపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జాయింట్ కలెక్టర్ అమరేందర్, జిల్లా సర్వేయర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రతి ఇంచు భూమి రీ సర్వే చేయడం జరుగుతుందని, రీ సర్వే ద్వారా భూముల సరిహద్దులు ఖచ్చితంగా నిర్ణయించబడతాయని తెలిపారు. దీంతో భూ వివాదాలు తగ్గి, రైతులకు స్పష్టమైన హక్కులు లభిస్తాయని అన్నారు.రైతులు, భూమి యజమానులు ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో తాసిల్దార్, రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా శివసేన సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**అచ్చంపేట, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట కేంద్రంలోని వై జంక్షన్ వద్ద శివసేన సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. అచ్చంపేట పట్టణం నుంచి పాదయాత్ర చేస్తూ శ్రీశైలం వెళ్లే శివ స్వాములు, ఆటోలో ప్రయాణించే భక్తులు, బైక్‌లపై వెళ్లే స్వాములకు ప్రతిరోజూ 100 నుంచి 500 మందికి అన్నప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు దంపతులు నిర్వహించారు. గత పది సంవత్సరాలుగా ప్రతి శివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు, శివ స్వాములకు అన్నదాన కార్యక్రమం చేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. భక్తులు, గ్రామస్థులు దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆశీస్సులు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో గొర్ల నరసింహ, సుంకరి లింగమయ్య, రాజు, మహేష్, విష్ణు యాదవ్, కృష్ణ యాదవ్, నిరంజన్, శీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు. శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ పండుగ ఉత్సవాలు



**బల్మూరు, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని జినుకుంట గ్రామంలో యాదవ్ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ పండుగ ఉత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన ఆశీస్సులు పొందినట్లు గ్రామస్థులు తెలిపారు.ఉత్సవాల్లో బల్మూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు కాశన్న యాదవ్, సర్పంచ్ రాధాకృష్ణ, ఎల్ల స్వామి, గ్రామ కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, రామగౌడ్, శ్రీనివాసులు, పురుషోత్తం, పరశురాములు, శివ, శ్రీశైలం, బాలయ్య, నరసింహ, తిరుపతయ్యతో పాటు గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.గ్రామంలో భక్తి, ఆనందం నిండిన వాతావరణంలో ఎల్లమ్మ పండుగ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

## బౌరాపూర్ బ్రహ్మోత్సవాలపై
# ఎమ్మెల్యే వంశీకృష్ణ సమీక్ష

**అమ్రాబాద్, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో బౌరాపూర్ జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరగనున్న జాతర కోసం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, నల్లమల్ల అడవి క్షేత్రంలో జరిగే ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సదుపాయం, ఆహార సదుపాయాలు, ఇతర అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం ప్రత్యేకంగా




చేస్తుందని తెలిపారు. ఆదివాసుల ఆరాధ్య దైవమైన బౌరాపూర్ జాతరలో ఆదివాసి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ జాతర ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. వందల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఆనవాయితీని మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు.జాతర విజయవంతం కావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు, ఆదివాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు
# నిజమైన లబ్ధిదారులకు చేరాలి

**- ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**అచ్చంపేట, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో అంగన్వాడి సూపర్వైజర్లు, సీడీపీఓలతో సమీక్ష సమావేశం జరిగింది. అచ్చంపేట డివిజన్ వ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల పనితీరు, పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, ప్రీ-స్కూల్ విద్య అమలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, సూపర్వైజర్లు, సీడీపీఓలు ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి ఆయాలు, టీచర్లు ప్రతిరోజూ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, గ్రామీణ



ప్రాంతాల్లో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆయన సూచించారు.ప్రతి కేంద్రంలో పిల్లల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య తనిఖీలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూపర్వైజర్లు, సీడీపీఓలకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీడీపీఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు హక్కులు కల్పించాలని సిఐటియు డిమాండ్

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండల కేంద్రంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అంగన్వాడీ టీచర్స్ పద్మ, సరస్వతి పిలుపునిచ్చారు.సిఐటియు మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు కార్మిక సంఘ హక్కులను గుర్తించాలని, 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఐసిడిఎస్‌కు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్స్‌ను మూడవ తరగతి, హెల్పర్స్‌ను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా



క్రమబద్ధీకరించాలని, క్రమబద్ధీకరణ జరిగే వరకు నెలకు కనీసం 26 వేల వేతనం, 10 వేల పెన్షన్ చెల్లించాలని కోరారు.దేశవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గ్రాట్యూటీ కోసం సుప్రీంకోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని, ఐసిడిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించరాదని ఆయన స్పష్టం చేశారు. డిజిటలైజేషన్, ఎఫ్ఆర్ఎస్ పేరుతో అంగన్వాడీ సిబ్బందిని వేధించరాదని, సంబంధంలేని అదనపు పనులు అప్పగించరాదని హెచ్చరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రీ-ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పద్మ, సరస్వతి, భాగ్యమ్మతో పాటు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల్లో ప్రజలకు నిజాయితీగా ఓటు వేయాలని పిలుపు

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల్లో ప్రజలు నిజాయితీపరులను, ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు.స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి కోసం కృషి చేసే వ్యక్తులను ఎన్నుకోవాలని, ధనబలం, అవినీతి ఆధారంగా ప్రజలను మభ్యపెట్టే అవకాశవాదులను ఓటుతో సమాధానం చెప్పాలని కోరారు. గత రెండేళ్లలో పట్టణంలో అభివృద్ధి జరగలేదని, ప్రజాప్రతినిధులు తమ స్వార్థ



ప్రయోజనాలకే పనిచేశారని విమర్శించారు.తాము శాసనసభ్యులుగా ఉన్న సమయంలో రోడ్లు, మంచినీటి వ్యవస్థ, డ్రైనేజీ పనులు చురుకుగా సాగాయని, ఆ తర్వాత కొత్త అభివృద్ధి జరగలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల సంపదను బడాబాబులకు అప్పగిస్తున్నాయని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం కార్మిక--రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేస్తోందని, వీటిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు వస్తాయని, ప్రజలు వాటిలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రాచీన ఆలయానికి ఆదరణ కరువు






శిథిల వ్యవస్థలో వీరభద్రుని విగ్రహం


సెగ్యామ దయాకర్ శర్మ ప్రధాన అర్చకులు శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయం


కప్పల ప్రవీణ్ ఎలిగేడు గ్రామ సర్పంచ్


ముంజం నరేష్ ఎలిగేడు ఉపసర్పంచ్

**ఎలిగేడు, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల కేంద్రంలోని అత్యంత ప్రాచీనమైన శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయం ఆదరణకు కరువైంది. 13వ శతాబ్ద కాలంలో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి కాకతీయ ఆస్థాన వేద పండితులతో అత్యంత శక్తివంతమైన బ్రహ్మసూత్ర శివలింగానికి ప్రాణ ప్రతిష్ట చేసినట్లు చారిత్రిక ఆధారాలు ఉన్నాయి. ఆలయానికి ఆనుకుని మద్దుల చెరువును కాకతీయ రాజులు ఏర్పాటు చేశారు. ఆ నీటిని వ్యవసాయ సాగుకు వాడుకున్న రైతులు చెల్లించే పన్నులతో ఆలయ నిర్వహణ చూసేవారు. కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించిన రాణి రుద్రమదేవి ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పర్వదినాలలో శివ కళ్యాణం ఉత్సవాలు జరిపించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. పన్నుల వసూలు ఆలయ నిర్వహణపై లిఖించిన శాసనాలు కరీంనగర్ పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నాయి.

**మహిమాన్వితమైన ఆలయం పై నిర్లక్ష్యం**
వేద పండితుల మంత్రోచ్ఛరణతో ప్రాణ ప్రతిష్ట చేయబడిన అత్యంత శక్తివంతమైన బ్రహ్మసూత్రం కలిగిన శ్రీ భవానీ రామలింగేశ్వర ఆలయం పాలకుల నిర్లక్ష్యం మూలంగా శిథిలావస్థకు చేరుకుంది. కాకతీయ రాజులు నిర్మించిన ఈ ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, నందీశ్వరుడితోపాటు క్షేత్రపాలకుడిగా వీరభద్రుడు కొలువుదీరి ఉన్నాడు. స్వామివారిని దర్శించుకునే భక్తులు ఆలయం ముందు ఉన్న కోనేరులో స్నానమాచరించి మొక్కులు చెల్లించుకునేవారు. ప్రస్తుతం కోనేరు కనుమరుగై పోయింది. కాలక్రమేనా ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలను ప్రతిష్టించారు. కాకతీయ రాజుల కాలంలో అత్యంత వైభవంగా విరజిల్లిన ఈ ఆలయం నేడు అభివృద్ధికి దూరమైంది. పాలకుల నిర్లక్ష్యం తో ఆలయ గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. కాకతీయ సామ్రాజ్య వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

**శివ కళ్యాణం మహోత్సవం**
కాకతీయ కాలం రాజుల నుండి నేటి వరకు శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శివరాత్రి శివ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు దయాకర్, వేద పండితులు శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. దేశ విదేశాల్లో నుండి ఈ ఆలయంలో నిర్వహించే శివ కళ్యాణ మహోత్సవానికి భక్తులు వస్తుంటారు. అత్యంత శక్తివంతమైన బ్రహ్మసూత్ర శివలింగాన్ని దర్శించుకోవడం తో జన్మ చరితార్థమవుతుందని శివలోక ప్రాప్తి (మోక్షం) కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీ భవాని రామలింగేశ్వర బ్రహ్మసూత్ర శివలింగం దర్శనంతో జన్మజన్మల పాపాలు హరించుకు పోతాయని భక్తుల నమ్మకం. శివరాత్రి పర్వదినాన ఆలయాన్ని ఎంతో సుందరంగా అలంకరిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అర్చకులు ఏర్పాటు చేస్తారు. శివ కళ్యాణ మహోత్సవం పూర్తి అయిన తర్వాత అన్నదానం నిర్వహిస్తారు.

**ఆలయ కమిటీ ని ఏర్పాటు చేస్తాం**
కప్పల ప్రవీణ్ సర్పంచ్(ఎలిగేడు)
ఎలిగేడు గ్రామంలో ప్రాచీనమైన శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి గ్రామంలోని అన్ని కులాల సహకారంతో శాశ్వత ఆలయ కమిటీని ఏర్పాటు చేస్తాం. ఆలయ నిర్వహణకు గ్రామ పాలకవర్గం సహకారం ఉంటుంది.

**ముంజం నరేష్ ఉపసర్పంచ్ (ఎలిగేడు)**
బ్రహ్మసూత్ర శివలింగం ఎలిగేడు గ్రామంలో ఉండడం గ్రామ ప్రజల అదృష్టం. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం.
పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో ఆలయ పునరుద్ధరణ చేసి తీరుతాం.

**ప్రధాన అర్చకులు దయాకర్**
ప్రాచీనమైన శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో వారసత్వంగా ప్రధాన అర్చకునిగా పనిచేస్తున్నాను. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరుకుతుంది. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం పాలకవర్గాలు స్పందించి ఈ ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలి. ఈ శివరాత్రికి శివపార్వతుల కళ్యాణం జరిపేందుకు ఏర్పాటు చేస్తున్నాము.

# పదవ తరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు



**గంగాధర, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివేకానంద విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్, లయన్స్ క్లబ్ సభ్యుడు, రచయిత మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలా నేర్చుకోవాలి అనే అంశంపై మోటివేషన్ క్లాస్ జరిగింది. గెలవాలనే తపన నీలో ఉంటే నిన్ను ఓడించే శక్తి ప్రపంచంలో ఏదీ లేదు అని విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, ఉత్తమ మార్కులు సాధించడానికి అవసరమైన దిశానిర్దేశాలను సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు




**కడ్తాల్, ఫిబ్రవరి 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం గేటు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది.. స్థానికుల కథనం ప్రకారం.. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన సాకలి జంగయ్య బైక్ పై హైదరాబాద్ వెళ్లి తిరిగి గట్టిప్పలపల్లి వెళుతుండగా మాధారం గేటు శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో జంగయ్య గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108ద్వారా అస్పత్రికి తరలించారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం







**షాద్‌నగర్, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధుల కోసం సిబ్బంది సంసిద్ధమై పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. జిల్లా ఎన్నికల అధికారి సునీతా రెడ్డి ఆధ్వర్యంలో విధుల కేటాయింపు జరిగింది. 28 వార్డులకు సంబంధించి 53,403 మంది ఓటర్ల కోసం 76 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్, ఎన్నికల అధికారి సునీతా రెడ్డి తెలిపారు. 300 మందికి పైగా పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆర్డీవో సరిత సమక్షంలో విధుల కేటాయింపులు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బంది బాక్సులు స్వీకరించి విధి నిర్వహణకు సమాయత్తమయ్యారు. మరోవైపు పోలీసులు కూడా 28 వార్డుల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీపీ శిరీష ఆధ్వర్యంలో 200 మందికి పైగా పోలీసులు విధులు నిర్వహించనున్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన ఆరు వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల ఏర్పాట్లు, బందోబస్తు పరిస్థితులను స్థానిక ఏసీపీ లక్ష్మీనారాయణ ఉదయం పరిశీలించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# పురపాలక ఎన్నికల ప్రచారంలో కళాకారుల ఆట పాట



**హుస్నాబాద్, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉద్యమ నిరుద్యోగ కళాకారులు ఆట--పాటలతో ప్రజలను అలరించారు. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఈ కార్యక్రమం జరిగింది. కళాకారులు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాటల రూపంలో వివరించి, అభ్యర్థులకు ఓటు వేసి అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ఉత్సాహాన్ని రేకెత్తిస్తూ ఆట--పాటలతో వేదికను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బోనగిరి శ్రీకాంత్, గద్ద సంపత్, గొల్లపల్లి వినోద్, పొన్నాల అశోక్ (డప్పు), నేర్నాల రాజు, వేముగంటి చక్రి, ఎనగందుల అనిల్, ప్రణిత, పూజ, శ్రీలత, ఎనగందుల మహేందర్, అభి పాల్గొన్నారు.

# ఓటు అమ్ముకుంటే మనమే పరిపాలన కోల్పోతాం

**-కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో చైతన్యవంతంగా ఓటు వేయాలి**
**- గంగవరం రామకృష్ణారెడ్డి**



**వనపర్తి ఫిబ్రవరి 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చైతన్యవంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టి డబ్ల్యూ జె ఎఫ్) వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు అనేది మనం మనమే పరిపాలించుకోవడానికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ‘ఓటును నోటుకు అమ్ముకుంటే, మన భవిష్యత్తును మనమే అమ్ముకున్నట్టే. నోటు పెట్టి కొనుక్కున్నవాడు మనలను కీలుబొమ్మలుగా మార్చేస్తాడు” అని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అనేవి కేవలం అధికార మార్పిడికోసం కాకుండా, నీటి సరఫరా, పారిశు ధ్యం, వార్డు అభివృద్ధి, మౌలిక వసతుల అమలు వంటి అంశాల్లో ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేయడానికి నిర్వహించబడతాయని వివరించారు. మన ఆలోచనలు, మన అవసరాలు ఒకే ప్రతినిధి ద్వారా ప్రభుత్వానికి చేరవేయాలనే ఉద్దేశంతోనే ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారని తెలిపారు. ‘మన రేపటి భవిష్యత్తు కోసం, రాబోయే తరాల కోసం అందరం నడుం బిగించి ముందుకు రావాలి. ఓటింగ్ శాతం 50--60 శాతం వద్దే ఆగిపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రతి పట్టణంలో 85--90 శాతం ఓటింగ్ నమోదు కావాలి” అని గట్టిగా పేర్కొన్నారు. ఎవరికైనా అభ్యర్థులపై పూర్తి సంతృప్తి లేకపోతే, నోటా అయినా సరే ఓటు వేసి తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలి అని సూచించారు. దేశానికి అహర్నిశలు సేవ చేస్తున్న సైనికులు, నష్టాలు వచ్చినా ఆహారాన్ని అందిస్తున్న రైతులు, జీతాలు లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడుతున్న జర్నలిస్టులు, పారిశుధ్య కార్మికులు, రైలు, ఆర్టీసీ ఉద్యోగులు---అందరూ తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేశారు.
“అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్న పట్టణ ప్రజలు ఓటు వేయకపోతే, అది భవిష్యత్తులో ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. రాబోయే రోజుల్లో ఓటింగ్‌లో పాల్గొనని వారిపై ఆంక్షలు విధించే పరిస్థితులు కూడా రావచ్చు” అని హెచ్చరించారు. మాలాంటి సామాజికవేత్తలు చేతులెత్తి ప్రజలను ప్రాధేయపడుతున్నామని పేర్కొంటూ,
“మీ చేతిలో ఉన్న పరిపాలనను మీ చేతిలోనే ఉంచుకోండి. జై ప్రజాస్వామ్యం” అని ఆయన పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత

**ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు**
**గీవనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు**



**వనపర్తి ఫిబ్రవరి10( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** జిల్లా పరిధిలో జరుగుతున్న వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు తెలిపారు. ఎన్నికల విధులలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని RG ఫంక్షన్ హాలులో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా క్రమశిక్షణతో పనిచేయాలని డిఎస్పీ ఆదేశించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు చేరుకుని, ఓటర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధించబడిందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పికెటింగ్, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం అనుమతించబడదని స్పష్టం చేశారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలని ఎన్నికల సమయంలో ఉద్రిక్తత సృష్టించడం, గుంపులు గుమికూడడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం వంటి చర్యలు జరుగుతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం, డబ్బుల పంపిణీ చేసినా, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో, ఇతర ప్రసార మాధ్యమాలలో వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐరత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్,వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ ఎన్నికల విధులకు వెళు తున్న అధికారులు ఎస్సైలు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్ళు, హోంగార్డు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పురపాలక ఎన్నికలకు పటిష్టమైన పోలీస్ బందోబస్త్

**సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో జరగాలని లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి జోన్ పరిధిలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలో, మంచిర్యాల జోన్ పరిధిలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రశాంతంగా జరగేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 851 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 513 సాధారణ కేంద్రాలు, 338 క్రిటికల్ కేంద్రాలు ఉన్నాయని కమిషనర్ వివరించారు. ఎన్నికల ముందు రోజు, ఎన్నికల రోజు, ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెక్‌పోస్టులు, పికెట్లు, మొబైల్ ప్యాట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఇప్పటివరకు నగదు, మద్యం, గంజాయి, పిడిఎస్ బియ్యం సీజ్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 135 కేసుల్లో 282 మందిని బైండోవర్ చేసినట్లు, గన్ లైసెన్స్ కలిగిన వారిలో కొందరి ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు తెలిపారు. మొత్తం 1,500 మంది పోలీస్ సిబ్బందితో ఎన్నికల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రజలు శాంతియుతంగా, ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన స్పష్టం చేశారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

**- అడిషనల్ డీసీపీ సత్యనారాయణ**





**ఆమనగల్లు, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పుర ఎన్నికల నేపథ్యంలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయనునట్లు చెప్పారు. పెట్రోలింగ్, పోలింగ్ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐ జానకీ రాం రెడ్డి, ఎస్సై వెంకటేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డి ప్రోత్సాహార్థక సన్మానంలో రచయిత గంగవరం రామకృష్ణారెడ్డికి సన్మానం



**వనపర్తి ఫిబ్రవరి 10( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా కేంద్రంలోని వద్దిరాంరెడ్డి కాలనీ నాగవరం రెడ్డి సేవా సమితి కళ్యాణ మండపంలో నేడు పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న రెడ్డి సోదరులకు ప్రోత్సాహార్థక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రచయితగా, జర్నలిస్టుగా గుర్తింపు పొందుతున్న గంగవరం రామకృష్ణారెడ్డిని సన్మానించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి మెగా రెడ్డి ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులపై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమీక్ష



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, ఇబ్రహీంపట్నం పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం నాణ్యత, వార్డులు, అత్యవసర విభాగం, ప్రసూతి కేంద్రం, ల్యాబ్ సౌకర్యాలు వంటి అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. ఇది సాధారణ భవనం కాదు... ఇబ్రహీంపట్నం ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే ఆసుపత్రి అని ఆయన స్పష్టం చేశారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. నాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి పూర్తయితే ఇబ్రహీంపట్నం, పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నగరానికి వెళ్లాల్సిన అవసరం తగ్గనుంది. ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే రంగారెడ్డి తీసుకుంటున్న చర్యలను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

**ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ మరియు**
**హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పోరం ల 2026 డైరీ లకు ఎస్సిడిడి సెక్రటరీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సందేశం...**
**హర్షం వ్యక్తం చేసిన ఆ సంఘాల నేతలు ఉప్పు సత్యనారాయణ, భాస్కర్...**



**హైదరాబాద్, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎస్సీడిడి మినీస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ (టిజి ఎస్సీడిడి ఎం ఎస్ ఎ) డైరీ 2026 తో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం లకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ లకు ప్రభుత్వ కార్యదర్శి మరియు ఎస్సీడిడి కమిషనర్ డాక్టర్ బుద్ధదేవ్ జ్యోతి సందేశాలు అందజేయడం జరిగింది. ఆ సందేశపు లెటర్ ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ కు ఎస్సీడిడి మినీస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ (టిజి ఎస్సీడిడి ఎం ఎస్ ఎ) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అందజేయడం జరిగింది. అదే విధంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్ ఎసిడిడి మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ లెటర్ ను ఉప్పు సత్యనారాయణ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు సునీల్, కిరణ్, రవితేజ, శ్రీనివాస్, నరేష్ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## ఉమెన్స్ వింగ్ ఉపాధ్యక్షురాలుగా ఎల్.సబితను నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కె.లత...



**హైదరాబాద్, ఫిబ్రవరి 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉమెన్స్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఎల్.సబిత ను నియమిస్తూ ఉమెన్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కె.లత ఒక ప్రకటనలో ఇది తెలిపారు. ఇది ఇలా ఉండగా ఉమెన్స్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన ఎల్. సబిత ఎస్సిడిడి కరీంనగర్ కార్యాలయ సూపరింటెండెంట్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ తనను నియమించిన ఉమెన్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కె.లత కు, టీజీ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సంపత్ కుమార్ మరియు రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, మహిళా ఉద్యోగునిల హక్కుల కోసం కృషి చేస్తానని సబిత అన్నారు.


## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

**- రాయికంటి శ్రీనివాస్**



**మనకొండూర్, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో రాజ్యాంగ హక్కులను హరిస్తున్న విధానాలపై ఐక్య పోరాటాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాలను ప్రవేశపెట్టడం ద్వారా కూలీలకు ఉపాధి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధానాలను అడ్డుకోవడానికి కార్మికులు, కర్షకులు, ప్రజలు అందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పురపాలక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి - జైపాల్ యాదవ్



**ఆమనగల్, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆమనగల్ మున్సిపాలిటీ 15 వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఫిబ్రవరి 11న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలు అభివృద్ధి చెందారని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్ అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి, మున్సిపల్ చైర్మన్ పదవిని అఖండ మెజార్టీతో గెలిపించాలని జైపాల్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆమనగల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి అని ఆయన స్పష్టం చేశారు

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల

**అమ్రాబాద్,జనవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల జాతర కరపత్రాలను అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రాయలగండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలోని కమాన్ (ముఖ ద్వారం) ఏర్పాట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రత్యేక నిధులతో చేపట్టినట్లు తెలిపారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి కొండా సురేఖ ఫారెస్ట్ అధికారులతో ప్రత్యేకంగా





మాట్లాడి కమాన్ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రారంభించాలని దేవస్థాన కమిటీకి సూచించినట్లు వివరించారు. రాయలగండి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 25 వరకు పెద్ద ఎత్తున జరగనున్నాయి. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం 22న జరుగుతుంది. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మన్నలూరు సర్పంచ్ మంజుల, చిగుర్ల కోటయ్య, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, అధ్యక్షుడు చింతల రాజగోపాల్, శంభు, వెంకటరమణ, కేశవులు, ఆనంద్, అనిల్, సర్దార్, రాంబాబు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని, రామగుండం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, అర్బన్ లోకల్ బాడీస్‌కు రెండవ సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనున్నాయని, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 123 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని, దాదాపు 470 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించనున్నామని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## గీతా కార్మికుల పెండింగ్ ఎక్స్ గ్రేషియాలు వెంటనే చెల్లించాలని డిమాండ్




**గంగాధర, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల జిల్లా కొండగట్టులో గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ అభివృద్ధి కమిటీ సమావేశంలో గీతా కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు గంధమల్ల రాములు గౌడ్, ఫౌండర్ ఢ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి ఏటా దాదాపు 600 మంది కల్లుగీతా కార్మికులు తాటి చెట్లపై నుండి జారి పడుతున్నారని, అందులో 200 మంది వరకు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. అనేక మంది అవయవాలు కోల్పోయి వికలాంగులుగా జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాటి చెట్లపై నుండి జారిపడి మరణించిన గీతా కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. చెట్లు ఎక్కలేని పరిస్థితిలో ఉన్న వారికి ప్రత్యేక ప్యాకేజీ సహాయం అందించాలని, 50 సంవత్సరాలు దాటిన గీతా కార్మికులకు నెలకు 4 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అదనంగా, ఆబ్కారి శాఖ ఐడి కార్డు కలిగిన ప్రతి గీతా కార్మికుడు ఏ రకంగా మరణించినా తక్షణ సహాయం కింద ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గీతా కార్మికుల సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని అభివృద్ధి కమిటీ స్పష్టం చేసింది.

## ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఎంపీడీఓ సమీక్ష



**పాలకుర్తి, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శశికళ అధ్యక్షతన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, డిసిబి వంద శాతం పన్నులు వసూలు చేయాలని, ట్రేడ్ లైసెన్స్‌ల రిన్యువల్, గ్రామాలలో పరిశుభ్రత, పర్యావరణం, శానిటేషన్ పనుల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, హరితహారం మొక్కలకు నీరు పట్టడం, ఈజీఎస్ ద్వారా నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచాలని, పీఎస్ యాప్‌లో ఇన్‌స్పెక్షన్ రిమార్క్‌ను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్ష చేసి, వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

## రామలింగేశ్వర స్వామి కళ్యాణ వేడుకలకు ఆహ్వానం



**వెల్దండ, ఫిబ్రవరి 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వెల్దండ మండలంలోని గుండాల గ్రామపంచాయతీ శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న శివరాత్రి కళ్యాణ వేడుకల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కల్వకుర్తి స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ చైర్మన్, పూజారులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వేడుకలకు ఆహ్వానిస్తూ, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్, పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## అపోలో లాభంలో వృద్ధి

Indraprastha Apollo HOSPITALS

TOUCHING LIVES

**హైదరాబాద్,**

అపోలో హాస్పిటల్స్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 35 శాతం ఎగబాకి రూ.502 కోట్లకు చేరుకున్నది. మూడు బిజినెస్ వర్టికల్స్ అంచనాలకు మించి రాణించడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. కంపెనీ ఆదాయం రూ.6,477 కోట్లకు ఎగబాకింది.

## ఏ మాత్రం తరగని బంగారం వెండి, ధరలు




తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతూ పోతున్న బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 9 సోమవారం నాటి ధరలే కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఫిబ్రవరి 10 మంగళవారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,910 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,750గా ఉంది. కిలో వెండి ధర రూ.3,00,000లు పలుకుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో మంగళవారం బంగారం,వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశరాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,58,060 ఉంటే, 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,44,900 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,910, అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,750లు పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ట్రేడవుతుండగా... 22 క్యారెట్ల బంగారం రూ.1,45,800 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,57,910లు, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,44,750 పలుకుతోంది. వెండి కిలో రూ. 3,00,000గా ఉంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్ చేసుకుంటే మంచిది.

## వరుసగా మూడో రోజూ లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు.

### లాభాలకు కారణం అదే..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్‌ల లాభంతో 25,935 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్‌లు మెరుగ్గా రాణించాయి.నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్ఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది.



డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా ఒక శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి తక్షణ మద్దతు 25,550--25,600 స్థాయిల వద్ద ఉన్నది.

# స్పోర్ట్స్

## 8 రోజుల డ్రామాకు తెర... కొలంబోలో ఇండియా--పాక్ మహాసమరం



టీ20 వరల్డ్ కప్‌లో క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియా--పాకిస్థాన్ మ్యాచ్‌కు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది . చిరకాల ప్రత్యర్థులైన ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన హై వోల్టేజ్ పోరు గత కొన్ని రోజులుగా అనిశ్చితిలో నిలిచినా, ఇప్పుడు పరిస్థితులు సానుకూలంగా మారాయి. దాదాపు ఎనిమిది రోజులుగా కొనసాగిన పాకిస్థాన్ డ్రామాకు ముగింపు పలికే దిశగా పరిణామాలు సాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 15న శ్రీలంకలోని కొలంబో వేదికగా మ్యాచ్ నిర్వహణకు మార్గం సుగమమం అయింది. సోమవారం రాత్రి ఈ మేరకు పాక్ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. స్నేహపూర్వక దేశాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, బహుళపక్ష చర్చల్లో సాధించిన ఫలితాల దృష్ట్యా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.అంతేకాదు క్రికెట్ స్ఫూర్తిని కాపాడటంతో పాటు, ఈ గ్లోబల్ క్రీడ కొనసాగింపునకు మద్దతు ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేసింది. శ్రీలంక వేదికగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరిస్తున్నట్లు ముందుగా సంకేతాలు ఇవ్వడంతో టోర్నమెంట్‌పై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రంగంలోకి దిగింది. ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా స్వయంగా పాకిస్థాన్‌కు వెళ్లి లాహోర్‌లో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీతో సమావేశమయ్యారు. మ్యాచ్ ఆడకపోతే ఎదురయ్యే ఆర్థిక, ప్రతిష్టాపరమైన పరిణామాలను పాక్ బోర్డుకు వివరించినట్లు సమాచారం. అయితే బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించిన నేపథ్యంలో వారికి మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలనే వైఖరిని పాక్ ముందుగా ప్రదర్శించింది. ఈ పరిణామాల మధ్య ఐసీసీ--పీసీబీ సమావేశాలు కీలక మలుపు తిప్పాయి. ఈ చర్చల్లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ చైర్మన్ అమీనుల్ ఇస్లాం కూడా పాల్గొనడం విశేషం.మరోవైపు బంగ్లాదేశ్ బోర్డు చైర్మన్ అమీనుల్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు కూడా ఈ వ్యవహారానికి కొత్త దిశను చూపించాయి. పాకిస్థాన్ నిజమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిందని ఆయన ప్రశంసలు కురిపించారు. తమకు మద్దతుగా నిలిచిన పీసీబీకి కృతజ్ఞతలు తెలుపుతూ, క్రికెట్ మేలుకోసం భారత్‌తో మ్యాచ్ ఆడాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రకటనలు పాక్ వైఖరిలో మార్పుకు కారణమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తం మీద, రాజకీయ ఉద్రిక్తతల నీడలో సాగిన ఈ వివాదానికి తెరపడింది.. క్రికెట్ ప్రేమికులకు ఇది నిజంగా థ్రిల్లింగ్ న్యూస్‌గా మారింది.

## ఫర్హాన్ మెరుపులతో..యూఎస్‌ఏపై పాక్ ఘనవిజయం




కొలంబో: మెగా టోర్నీలో తొలి మ్యాచ్‌ను అతికష్టమ్మీద గెలిచిన పాకిస్థాన్.. రెండో మ్యాచ్‌లో మాత్రం రాణించింది. గత టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో తమకు ఓటమి రుచి చూపించిన యూఎస్‌ఏపై ప్రతీకారం తీర్చుకుంటూ ఆ జట్టుపై 32 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. పాకిస్థాన్ నిర్దేశించిన 191 పరుగుల ఛేదనలో యూఎస్‌ఏ.. నిర్ణీత ఓవర్లలో 158/8కే పరిమితమైంది. శుభమ్ రంజనె (30 బంతుల్లో 51, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) శయన్ జహంగీర్ (49) పోరాడారు. యూఎస్‌ఏ బ్యాటర్లను స్పిన్నర్లు నిలువరించి ఆ జట్టుకు టోర్నీలో రెండో విజయాన్ని అందించారు. అంతకుముందు మొదలు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' షాహిబ్‌జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 73, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు బాబర్ ఆజమ్ (32 బంతుల్లో 46, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో 20 ఓవర్లకు 190/9 రన్స్ చేసింది.

**ఫర్హాన్ ధనాధన్**

రెండో ఓవర్లోనే మూడు బౌండరీలతో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఫర్హాన్ దూకుడుతో పాక్ పరుగుల వేట మొదలైంది. మరో ఓపెనర్ సయీమ్ అయూబ్ (19), కెప్టెన్ సల్మాన్ అఘా (1) ఒకే ఓవర్లో నిష్క్రమించినా ఫర్హాన్ జోరు తగ్గలేదు. పవర్ ప్లేలో 56/2తో ఉన్న దశలో బాబర్ అండతో అతడు మరింత రెచ్చిపోయాడు. 27 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తైంది. హర్మీత్ 13వ ఓవర్లో బాబర్.. 6, 4, 4తో పాటు ఫర్హాన్ కూడా బౌండరీ బాదడంతో 21 పరుగులొచ్చాయి. రెండు ఓవర్ల వ్యవధిలో ఈ ఇద్దరూ పెవిలియన్ చేరినా షాదాబ్ ఖాన్ (12 బంతుల్లో 30, 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో పాక్ భారీ స్కోరు చేసింది.

**స్పిన్నర్ల కట్టడి**

భారీ ఛేదనలో యూఎస్‌ఏకు మంచి ఆరంభమే దక్కింది. 4.4 ఓవర్లలో 41/0తో ఉన్న ఆ జట్టు ఆ తర్వాత గాడి తప్పింది. స్పిన్నర్ల రంగప్రవేశంతో పరుగుల రాకే గగనమైంది. ఉస్మాన్ తారీఖ్ (3/27), షాదాబ్ (2/26), మహ్మద్ నవాజ్ (1/21), అబ్రర్ అహ్మద్ (1/30) నియంత్రణతో బౌలింగ్ చేయడంతో యూఏఈ ఛేదనలో వెనుకబడిపోయింది. జహంగీర్, శుభమ్ పోరాడినా వారిద్దరూ భారీ షాట్లు ఆడలేక చతికిలపడ్డారు. స్పిన్నర్ల కట్టడితో మధ్య ఓవర్లలో పరుగుల రాక మందగించగా ఆఖర్లో ప్రత్యర్థిపై మరింత ఒత్తిడి పెంచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

**సంక్షిప్త స్కోర్లు :** పాకిస్థాన్: 20 ఓవర్లకు 190/9 (ఫర్హాన్ 73, బాబర్ 46, షాడ్లీ 4/25, మోహ్సిన్ 1/27);

**యూఎస్ఏ:** 20 ఓవర్లకు 158/8 (శుభమ్ 51, జహంగీర్ 49, ఉస్మాన్ 3/27, షాదాబ్ 2/26 )

## పది వికెట్లతో యూఏఈని ఓడించిన న్యూజిలాండ్..!




వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు చేతిలో చావుదెబ్బ తిన్న న్యూజిలాండ్ మెగా టోర్నీలో జూలు విదుల్చుతోంది. తొలిపోరులో అఫ్గనిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన కివీస్.. ఈసారి యూఏఈ భరతం పట్టింది. 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) మంచుముక్కలా కరిగించారు. హైలెట్స్ చూస్తున్నామా? అన్నట్టుగా రెండో ఓవర్ నుంచి దూకుడే మంత్రగా యూఏఈ బౌలర్లపై ఈ ద్వయం విరుచుకుపడింది. అర్ధ శతకాల అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై జాలి, దయ లేకుండా ఆడడంతో మరో26 బంతులు మిగిలి ఉండగానే మట్టికరిపించింది. టీ20 ప్రపంచకప్‌లో సంచలనం సృష్టించాలనుకున్న యూఏఈ కలలు కల్లలయ్యాయి. పటిష్టమైన న్యూజిలాండ్‌పై భారీ స్కోర్‌తో విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ జట్టుపై ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) పిడుగల్లే విరుచుకుపడ్డారు. 174 పరుగుల ఛేదనలో నువ్వానేనా అనట్టు ఇద్దరూ పోటీపడి బౌండరీల పండుగ చేసుకున్నారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 20 రన్స్ రాబట్టగా.. పవర్ ప్లేలోనే 80కి చేరువైంది కివీస్.ఈ జోడీని విడదీసేందుకు యూఏఈ సారథి వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. దాంతో.. చూస్తుండగానే లక్ష్యం చిన్నదైపోయింది. రోహిద్ వేసిన 16 వ ఓవర్ రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్‌గా మలవగా బ్లాక్ క్యాప్స్ 10 వికెట్లతో జయభేరి మోగించింది. వరుసగారెండో విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్ డీలో అగ్రస్థానానికి ఎగబాకింది.

వసీం, షరాఫు దంచేయగా..

చెన్నైలో పటిష్టమైన న్యూజిలాండ్‌కు మొదట యూఏఈ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్ ముహమ్మద్ వసీం(64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టగా.. అలీషన్ షరాఫు(55) హాఫ్ సెంచరీతోచెలరేగాడు. కివీస్ పేస్, స్పిన్ దళాన్ని ఉతికారేసిన ఈ ద్వయం విధ్వంసంతో 15 ఓవర్లకే స్కోర్ 120 దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్(21) దంచేశాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనకున్న ప్రత్యర్థికి షాకిస్తూ మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో యూఏఈ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.